క్లుప్తంగా

టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం సందర్శన



గుంటూరు ఎడ్యుకేషన్: నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో కొనసాగుతున్న టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలత సోమవారం సందర్శించారు. స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో కల్పించిన మౌలిక సదుపాయాలపై విధుల్లో ఉన్న ఉపాధ్యాయులను ఆరా తీశారు. స్పాట్ వేల్యూషన్ విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు నిబంధన ప్రకారం అన్ని సదుపాయాలు కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. పలు ఉపాధ్యాయులు సీనియారిటీ జాబితా, పదోన్నతులకు సంబంధించిన సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఆమె ఉపాధ్యాయులు హామీ ఇచ్చారు.

ఉచితంగా సామూహిక ఉపనయనాలు



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 1/13వ అడ్డ రోడ్డులోని బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో సోమవారం ఉచిత సామూహిక ఉపనయనాలు నిర్వహించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు నందిరాజు పాండురంగారావు, కార్యదర్శి రంగా వజ్జాల లక్ష్మీపతి, కోశాధికారి తుళ్లూరు ప్రకాష్, కన్వీనర్ మాదాల వెంకటకృష్ణ, కో– కన్వీనర్ కర్లపాలెం బాలకృష్ణ, సభ్యులు జి.రామకృష్ణారావు, ఎం.కోదండరామారావు, మారుతీరామగోపాల్, పి.మురళీమోహన్, బి.శివరామకృష్ణప్రసాద్, పి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

రైలు కింద పడి వృద్ధుడు మృతి

లక్ష్మీపురం: సుద్దపల్లి రైల్వే గేటు వద్ద రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు (60) మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడి ఆచూకి తెలియకపోవడంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురికి తరలించి, కేసు నమోదు చేశారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు జీఆర్పీ సీఐ అంజిబాబు 9440627546, ఎస్ఐ నారాయణరెడ్డి 8328018787 సమాచారం ఇవ్వాలని కోరారు.

వైభవంగా కోదండ రాముని పల్లకీ ఊరేగింపు



నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు గాంధీ బొమ్మ సెంటర్ శ్రీకోదండ రామాలయంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సుప్రభాత సేవ, స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజలను వేద పండితులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం కోదండ రాముని పల్లకీ ఊరేగింపు వైభవంగా జరిగింది. మంగళ వాయిద్యాలు, డప్పులు, కోలాట ప్రదర్శన మధ్య కొరిటెపాడు నగర వీధులలో ఊరేగింపు కొనసాగింది. ఆలయ అధ్యక్షులు కొమ్మినేని కోటేశ్వరరావు(బాబు), ఉపాధ్యక్షులు కె.ఆదినారాయణ, కోశాధికారి కె.ప్రసాద్, కమిటీ సభ్యులు కె.కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, పి శ్రీనివాస్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న పౌరాణిక పద్య నాటకాలు



నగరంపాలెం: స్థానిక నల్లచెరువు 15వ వీధిలోని పసుపులేటి గోపయ్య కళావేదికపై ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతి సమితి(విజయవాడ) సౌజన్యంతో పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం(గుంటూరు) ఉచిత పౌరాణిక పద్యనాటకం ప్రదర్శించారు. తొలుత శ్రీమద్ విరాట్ పోతు లూరి వీరబ్రహ్మం చరిత్రలోని సన్నివేశం ప్రదర్శించారు. బ్రహ్మం గారిగా ఉల్లంగుల బ్రహ్మం, సిద్దయ్యగా బిట్ర పూర్ణయ్య నటించారు. అనంతరం శ్రీకృష్ణరాయబారం మయసభ సన్నివేశం ప్రదర్శించారు. శ్రీకృష్ణులుగా పల్నాటి సుబ్బారావు, సనిశెట్టి సాంబశివరావు, కొల్లూరు శివప్రసాద రావు, దుర్యోధనుడుగా కందిపాటి వెంకటేశ్వరరావు, ఆలపాటి జనార్ధన్, షేక్ లాల్అహమ్మద్, కర్ణుడిగా షేక్ లాలు, అశ్వథామగా కిలారి శ్రీనివాసరావు, భీముడిగా నల్లక శ్రీనివాసరావు తదితర పాత్రల్లో పోషించారు. హార్మోనియంపై సిరిగిరి సాంబశివ రావు, క్లారినెట్ వెంకటరావు, డోలక్పై ఎం.రాము వాయిద్యాని అందించారు. అనంతరం కళాకారులను సత్కరించారు.

ఎక్కడి మురుగు అక్కడే..

- డ్రెయినేజీలలో మురుగు రోడ్లపైకి చేరిన వైనం
- చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు
- స్వచ్ఛ సర్వేక్షణ్ ఎక్కడ అంటున్న నగర వాసులు



నరసరావుపేట ఎంపీ ఇంటి పరిసరాల్లో దుస్థితి



లక్ష్మీపురం: నగరంలో పారిశుద్ధ్యం నిర్వహణ గాడిలో పడినట్లు కనిపించడం లేదు. రోజురోజుకు చెత్తతో పాటు డ్రెయిన్ల సమస్యలు వెంటాడుతున్నాయి. ఏ వార్డులో చూసిన ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో పనులు చేపట్టినట్లు చెబుతున్నా.. ఫలితం మాత్రం కనిపించడం లేదు. దీంతో ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బృందావన్ గార్డెన్స్ ఏరియాలో...

గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్ నుంచి రింగురోడ్డు వైపుగా ప్రయాణించే దారి మార్గంలో కూటమి నాయకుడు, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీ కృష్ణదేవరాయలు గృహం ఉంది. ఆ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సోమవారం రోడ్డు వైపు మురుగు నీరు చేరడంతో దుర్గంధం వెదజల్లుతోంది. సైడ్ కాలువ పైనే ఇటీవల రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లు తొలిగించి కాలువ పైన వేయడంతో కాలువలో ఉండే మురుగు నీరు అంతా రోడ్డు పైకి వచ్చి చేరింది. ఒక వైపు నగరపాలక సంస్థ కమిషనర్, స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో స్థానిక కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, శానిటరీ అధికారులతో కలసి తెల్లవారుజాము నుంచే పర్యటిస్తున్నారు. మరో వైపు పలు ప్రాంతాలలో పారిశుద్ధ్య సమస్యలతో ఇబ్బందులు పడుతునే ఉన్నారని తెలుస్తుంది. పగలు రాత్రి అనే తేడా లేకుండా దోమల దాటికి స్థానికులు విషజ్వరాల బారిన పడుతున్నారు. పార్లమెంట్ సభ్యుడి ఇంటి ముందు నుంచి దాదాపుగా 100 మీటర్లకు పైగా మురుగు నీరు రోడ్డు పైకి వచ్చి చేరడంతో అదే ప్రాంతంలో ఉన్న వ్యాపార సముదాయాలు, నివాస గృహాలు, అపార్ట్‌మెంట్‌లు, ప్రధానంగా ఓ కార్పొరేట్ స్కూల్ విద్యార్థులు, వాహన దారులు భరించలేదని దురవాసనతో రోడ్డు పైకి వచ్చి చేరిన మురుగు నీటిలోనే ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది.

స్వచ్ఛ సర్వేక్షణ్ ఎక్కడా..?

నగరపాలక సంస్థ కమిషనర్ స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం రాకకు ముందు నుంచే నగరంలోని 52 డివిజన్‌లలోని డంపింగ్ బాక్స్‌లను తొలిగించడంతో రోడ్ల పైనే చెత్త దర్శనం ఇస్తోంది. దానికి తోడు వయసు కారణంగా చూపించి పారిశుద్ధ్య కార్మికులను తగ్గించారు. దీంతో ఆయా ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులు చేసే వారు లేక ఇబ్బందులు పడుతున్నారు. సైడ్ డ్రెయినేజీలలో మురుగు పేరుకుపోయి రోడ్లపైకి వచ్చి చేరుతున్న నగరపాలక సంస్థ అధికారుల మాత్రం చోద్యం చూస్తున్నారు.

వ్యాధులపై అవగాహనతో నివారణ సాధ్యం

లలితా సూపర్ స్పెషాలిటీ చైర్మన్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ



కార్యక్రమానికి హాజరైన వైద్యుల బృందం

గుంటూరు మెడికల్: వ్యాధులపై అవగాహనతోనే 80శాతం నివారణ సాధ్యమని లలితా సూపర్ స్పెషాలిటీ చైర్మన్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ పేర్కొన్నారు. లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం' నిర్వహిస్తోందని చెప్పారు. ఏప్రిల్ నెలను 'ఆరోగ్య అవగాహన మాసం'గా జరుపుతున్నట్లు వెల్లడించారు. 35కి పైగా వైద్య వైద్య విభాగాలు, 100 మందికి పైగా స్పెషలిస్టులు, సూపర్ స్పెషలిస్టుల పర్యవేక్షణలో సేవలందిస్తున్నట్లు తెలిపారు. హోల్ బాడీ స్కాన్‌తో పాటు అన్ని ఆరోగ్య పరీక్షలపై 25శాతం రాయితీను అందిస్తున్నట్లు చెప్పారు. హాస్పిటల్ డీన్, సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదాలో తలకి గాయాలు కలిగే ప్రమాదాలను గురించి వివరించారు. 38 ఏళ్లకు మించని పిల్లలకు బైకులు ఇవ్వరాదని, అలాగే హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. మెడికల్ సూపరింటెండెంట్, జనరల్ – లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ ఉమా శంకర్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శివరామకృష్ణ, యూరాలజిస్ట్ డాక్టర్ శరవణ కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ చంద్రహాస్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ రాజేష్, చెవి ముక్కు, గొంతు స్పెషలిస్ట్ డాక్టర్ నఫీజ్, కార్డియాలజిస్ట్ డాక్టర్ మోహనర్జున్, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ అయ్యప్ప, సైకియాట్రిస్ట్ డాక్టర్ అజయ్, కంటి నిపుణుడు డాక్టర్ శ్రీనివాస్ వివన్ కుమార్, రేడియాలజిస్ట్ సుష్మలు వారి విభాగాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో 300 మందికి పైగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

వైద్య పరికరాలు అందించేందుకు దాతలు ముందుకు రావాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి
- ప్రైవేట్ ఆస్పత్రులు, ఐఎంఏ ప్రతినిధులతో పీ–4 సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, సీపీఓ శేషశ్రీ

గుంటూరు మెడికల్: ఆధునిక వైద్య సాంకేతిక పరికరాలు సమకూర్చుకోవాల్సి ఉందని, దాతలు ముందుకు రావాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి కోరారు. సోమవారం కార్పొరేట్ ఆస్పత్రులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.17.40 లక్షల విలువ చేసే ఆధునిక వైద్య సాంకేతిక పరికరాలు అవసరం ఉందని చెప్పారు. దాతలు ముందుకు వచ్చి వైద్య పరికరాలు సమకూర్చాలని కోరారు. సీపీఓ శేషశ్రీ మాట్లాడుతూ ఉగాది రోజున సీఎం ప్రారంభించిన 'పీ–4' కార్యక్రమం ద్వారా మౌలిక సదుపాయాల లేని పేదవారిని దత్తత తీసుకోవడం, వారి పిల్లల విద్య కొరకు సహాయం చేయడం, పేద వారికి ఎక్కువ మందికి ఉపయోగపడే మౌలిక సదుపాయాలు వైద్య ఆరోగ్య సేవల సహాయాన్ని చేయవచ్చునని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది నిరుపేదలు, ఉన్నారని మన గుంటూరు జిల్లాలో 1.15 లక్షలకు పైనే నిరుపేదలు ఉన్నారని వివరించారు. వారికి మౌలిక సదుపాయాలు కల్పించవలసిందిగా అభ్యర్థించారు. సమావేశానికి హాజరైన ప్రతినిధులు తప్పకుండా విద్య, వైద్య వైద్యానికి సంబంధించి సేవా కార్యక్రమాలు చేస్తామని హామీ ఇచ్చారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

డీఎస్పీ అరవింద్

లక్ష్మీపురం: నగరంలో బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వెస్ డీఎస్పీ అరవింద్ హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. ఐపీఎల్ మ్యాచ్‌లతో హాస్టల్స్, లాడ్జిలు, హోటల్స్‌లో బెట్టింగ్స్, ఆన్‌లైన్‌లో బెట్టింగులతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. నగరంలో గంజాయిని అరికట్టేందుకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. గంజాయి గుర్తిస్తే తక్షణమే టోల్ ఫ్రీ నంబర్ 1972 నంబర్‌కు గాని డీఎస్పీ నంబర్ 8688831330లకు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు, వివరాలను గోప్యంగా ఉంచుతామని వివరించారు. సబ్ డివిజన్ పరిధిలో బహిరంగ మద్యం తాగే వారిని ఉపేక్షించేది లేదని, డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తులకు మీ బ్యాంకు, ఆధార్ కార్డులకు సంబంధించిన గోప్యమైన ఓటీపీలు పాస్‌వర్డ్స్ చెప్పకూడదని, దీని వల్ల కూడా మీ ఆస్తి నష్టం జరుగుందని తెలిపారు.

ప్రభుత్వం నిర్లక్ష్యం వలనే కుక్కల దాడిలో బాలుడి మృతి

- బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి
- సీపీఎం నాయకుల డిమాండ్



మృతి చెందిన బాలుడి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

లక్ష్మీపురం: నగర శివారు ప్రాంతమైన స్వర్ణభారతీ నగర్ చివర ఈద్యానగర్‌లో బాలుడిపై కుక్కల దాడి ప్రభుత్వ నిర్లక్ష్యమేనని సీపీఎం జిల్లా, వై.నేతాజి, నగర కార్యదర్శి కె.నళినీకాంత్ ఆరోపించారు. కుక్కల దాడితో మృతి చెందిన బాలుడి మృతదేహాన్ని సోమవారం సందర్శించారు. కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెస్ట్ ఎమ్మెల్యే శాసన సభ సాక్షిగా కుక్కల బెడదను నివారించాలని వేడుకున్నా ప్రభుత్వ నుంచి ఎలాంటి చర్యలు లేదన్నారు.

ఈ నిర్లక్ష్యం కారణంగానే ఓ పసిబిడ్డ ప్రాణం పోయిందని దీనికి ప్రభుత్వం, స్థానిక అధికారులు పూర్తి బాధ్యత వహించాలని కోరారు. కూటమి నాయకులు నగరపాలక సంస్థలో అధికారంలోకి రావడానికి చూపించిన శ్రద్ధ, ప్రజా సమస్యల పరిష్కారంలో కొంతైన ఉండటం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఆ బాలుడి కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు పది లక్షల రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బిజముత్యాలరావు, ఆది నికల్సన్, షేక్ మస్తాన్ వలి, షేక్ ఖాశిం షహీద్, పి.మురళి, ఎండీ ముస్తాక్, సిహెచ్ కిన్నెర్ పాల్గొన్నారు.

శంకర్ విలాస్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి నిధులు పెంచాలి

లక్ష్మీపురం: శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పేర్కొన్నారు. కొత్తపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి రూ.170 కోట్లు అంచనా వేసి, రూ.100 కోట్లు కేటాయించడం సరైనది కాదన్నారు. చాలిచాలని నిధుల వల్ల బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత లోపిస్తుందని విమర్శించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నాణ్యత ప్రమాణాలతో బ్రిడ్జి నిర్మాణం జరగాలని చెప్పారు.

పన్నుపై ఐదు శాతం రాయితీ

నెహ్రూనగర్: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2 అర్థ సంవత్సరాల మొత్తం ఆస్తి పన్ను ఏక మొత్తంగా ఏప్రిల్ నెలాఖారులోగా చెల్లించిన వారికి పన్ను మొత్తంపై 5 శాతం రాయితీ ప్రభుత్వం అవకాశం కల్పించిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల పరిశీలన

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రత్తిపాడు నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న 1153 మందిలో సోమవారం దరఖాస్తులు పరిశీలించినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. అమరావతి రోడ్‌లోని నవీన స్కూల్లో దరఖాస్తుల పరిశీలన క్యాంప్‌కు 552 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

రాజధాని పారిశుద్ధ్య కార్మికుల బకాయిలు చెల్లించాలి



లక్ష్మీపురం: రాజధాని పారిశుద్ధ్య కార్మికులు ఫిబ్రవరి, మార్చి నెలల జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని, నెల నెలా జీతాలు పెండింగ్ లేకుండా చెల్లించాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్–వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు డిమాండ్ చేశారు. గోరంట్లలోని మున్సిపల్ మదర్ పాయింట్‌లో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల లాగానే రాజధాని పారిశుద్ధ్య కార్మికులకు కూడా రూ.21 వేలు జీతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజధాని పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న ఆందోళనకు సంఘీభావంగా గుంటూరులో మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.శివయ్య, కారసాల శౌరమ్మ, పచ్చల సామ్రాజ్యం, ధనలక్ష్మి, ఏసుబాబు, చెంచయ్య, యల్లయ్య, సుజాత, నిర్మల, బందెల పిచ్చమ్మ పాల్గొన్నారు.

పోలీస్ విచారణకు హాజరైన డాక్టర్ ప్రభావతి



ఒంగోలు టౌన్: మాజీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కస్టడీ కేసు విచారణాధికారి, ఎస్పీ ఏఆర్ దామోదర్ ఎదుట గుంటూరు జీజీహెచ్ రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో ఆమెను 5వ నిందితురాలిగా చేర్చి విచారణ చేస్తున్నారు. సోమవారం ఉదయం విచారణకు వచ్చిన ఆమెను మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత హాజరుకావాలని చెప్పారు. తొలిరోజు సుమారు నాలుగున్నర గంటల పాటు విచారించారు. విచారణలో ఆమె సంతృప్తికరంగా సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. మంగళవారం కూడా ఆమె విచారణకు హాజరుకానున్నారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సకాలంలో పరిష్కారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ డి.శ్రీనివాసరావు కోరారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు సోమవారం కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ జనన, మరణ విభాగం వద్ద పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 21 ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. అనంతరం పీజీఆర్ఎస్ ద్వారా 27 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీపీ రాంబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

నూరు శాతం పారిశుద్ధ్య పనులు జరగాలి

వార్డు సచివాలయం కేంద్రంగా నగరంలో నూరు శాతం పారిశుద్ధ్య పనులు జరగాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఏటీ అగ్రహారం, నల్లకుంట, ఎన్‌జీఓ కాలనీ, నగరాలు, గోరంట్ల తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, కార్మికుల హాజరు, పనితీరు శానిటరీ కార్యదర్శులే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ రమేష్, ఏసీపీ వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ రాజేష్ పాల్గొన్నారు.

సోషలిస్ట్ నాయకుడు పాపిరెడ్డికి అంతిమ వీడ్కోలు



పాపిరెడ్డి భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

గుంటూరు రూరల్: ప్రముఖ స్వాతంత్య్ర సమర యోధుడు, సోషలిస్ట్ పార్టీ నాయకుడు మోదుగుల పాపిరెడ్డి(88) అంతిమ యాత్ర సోమవారం నిర్వహించారు. సోమవారం నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్‌రోడ్డు రెడ్డిపాలెంలోని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి నివాసం నుంచి ఆయన అంతిమ యాత్ర నిర్వహించారు. తొలుత ఆయన పార్థివ దేహానికి నగరంలోని ప్రముఖులు, సాహితీవేత్తలు, పారిశ్రామిక వేత్తలు, పుర ప్రముఖులు, రాజకీయనాయకులు పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, కల్పలత, చంద్రగిరి ఏసురత్నం, ఆలపాటి రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నగర డెప్యూటీ మేయర్ డైమండ్‌బాబు, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నిమ్మకాయల రాజనారాయణ, డొక్కా మాణిక్యవరప్రసాద్, భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, అనూరాధ, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కొండవీడు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శివారెడ్డి, బొమ్మిడాల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లు చేసే పరీక్షల్లో కచ్చితత్వం పాటించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి



గుంటూరు మెడికల్: ల్యాబ్ టెక్నీషియన్లు చేసే పరీక్షల్లో కచ్చితత్వం పాటించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం పట్టణ ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్ల నెలవారి సమావేశం నిర్వహించారు. డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ల్యాబ్ పరీక్షల వివరాలను ల్యాబ్ బయట ప్రదర్శించాలని తెలిపారు. పరీక్షల నివేదికలను సకాలంలో రోగులకు అందించాలని సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో భాగంగా పాటించాల్సిన పరిసరాల పరిశుభ్రత, సరియైన వివాహ వయస్సు(ఆడపిల్లలకు 21 సం, మగపిల్లలకు 25 ఏళ్లు) పాటించేలా చూడాలన్నారు. ఆస్పత్రిలో కాన్పులకు ప్రాధాన్యం, పౌష్టికాహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, నమ్మకమైన వైద్యులను సంప్రదించుట, సిజేరియన్ కాన్పులకు దూరంగా ఉండుట, నవజాత శిశువుల సంరక్షణ, సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుట తదితర చర్యల వలన సంపూర్ణమైన ఆరోగ్యం సాధించవచ్చన్నారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, ఉప మలేరియా అధికారులు రాజు నాయక్, ప్రభాకర్ రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి సూదాశివ గణేష్, ఘంటసాల శ్రీనివాసరావు, నరేంద్ర, ప్రశాంత్ పాల్గొన్నారు.

డీఆర్ఎం సేన్‌కు అభినందనలు



డీఆర్ఎం సేన్‌ను సన్మానిస్తున్న రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

లక్ష్మీపురం: రైల్వే డీఆర్ఎంగా బాధ్యతలు చేపట్టిన సుధేష్ణ సేన్‌ను గుంటూరు రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు అభినందించారు. పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో సోమవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఆర్ఎంను అసోసియేషన్ సభ్యులు కలిసి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ డివిజనల్ సెక్రటరీ రాఘవబాబు, డివిజనల్ ప్రెసిడెంట్ నారాయణ రెడ్డి, డివిజనల్ ట్రెజరర్ ఆదినారాయణ, సుధాకర్, కోటేశ్వరరావు, ఎస్.ఎన్.సింగ్, పద్మావతి, అంజనాదేవి తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్, శ్రీకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం సంజీవయ్యనగర్ రైల్వేగేటు వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని గుర్తించి, జీవిత కాలాన్ని పెంచుకునేందుకు తగిన వ్యాయామం చేయాలని సూచించారు. రోజులో కొంత సమయం నడకకు కేటాయించి, ఆరోగ్యంపై శ్రద్ధ వహించి రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా హాసిని ఐ మిత్ర ఆప్టికల్స్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించి రాయితీపై కళ్లజోళ్లు అందించారు. కేఎస్ పున్నారావు క్లినికల్ లేబొరేటరీ ఆధ్వర్యంలో బీపీ, షుగర్ వంటి పరీక్షలతో పాటుగా రక్త పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ప్రాక్టీషనర్ వేల్పుల కోటేశ్వరరావు, జనరల్ మెడికల్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎతోస్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కోనంకి మురళీకృష్ణ యాదవ్, మెటికల సురేష్ యాదవ్, సునీల్, వలంటర్లు చంద్ర కిరణ్, బాల హనుమాన్, సాయి తేజ, నారాయణ పాల్గొన్నారు.

విజ్ఞాన విహారయాత్రలతో సృజనాత్మకత

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించడంలో విజ్ఞాన విహార యాత్రలు దోహదం చేస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కొండవీడుకోటకు విజ్ఞాన విహారయాత్రగా బయలుదేరిన ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల బస్సును సోమవారం నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాల వద్ద జెండా ఊపారు. ఈసందర్భంగా డీఈఓ రేణుక మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వంద మంది విద్యార్థులు, 20 మంది గైడ్ టీచర్లు యాత్రలో పాల్గొంటున్నట్లు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా, సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీలక్ష్మి విద్యార్థులతో కలిసి వెళ్లారు.

ఈదురు గాలులతో చిరు జల్లులు

కొరిటెపాడు: గుంటూరు నగరంతో పాటు జిల్లాలో పలు చోట్ల సోమవారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘామృతమై ఈదురు గాలులు వీచాయి. రాత్రి 7 గంటల నుంచి ఈదురు గాలులకు తోడు పలుచోట్ల చిరు జల్లులు పడ్డాయి. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. దీంతో గుంటూరు నగరంతో పాటు చాలా చోట్ల కొద్ది సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com